క్లుప్తంగా

నేడు రేషన్ కార్డుల పంపిణీ

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలోని దేవకీ గార్డెన్‌లో ఈ నెల 26న రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ

కడ్తాల్: ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ విరాజిల్లుతుందని, తద్వారా భక్తిభావం పెంపొందుతుందని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్పతినాయక్ అన్నారు. మండల పరిధి కాన్గుబావితండాలో నిర్మిస్తున్న తుల్జాభవాని అమ్మవారి ఆలయానికి రూ.10,116ల విరాళాన్ని ఆయన శుక్రవారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. భగవంతుడి నామస్మరణతో మానసిక ప్రశాంతత నెలకొంటుందని, దేవాలయాల నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్, నాయకులు రాజునాయక్, భీమన్‌నాయక్, సేవ్యా, రాజు, శ్రీను ఉన్నారు.

అటెండెన్స్ సర్టిఫికెట్ ఇవ్వండి


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

కడ్తాల్: సమగ్ర కుటుంబ సర్వే 2024లో పాల్గొన్న ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్ జారీ చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. శుక్రవారం ఎంపీడీఓ సుజాతకు మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్, ఉపాధ్యక్షుడు మల్లయ్య, పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడు పద్మావతమ్మ, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం

కడ్తాల్: ఆపదలో ఉన్న వారికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలుస్తుందని ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలో ఇటీవల ఆత్మీయులను కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆయన శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున నలుగురికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తులసీరాం, నర్సింహగౌడ్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ యాదయ్య, నాయకులు గోపాల్, జంగయ్య, శంకరయ్య, వెంకటయ్య ఉన్నారు.

అనుమానితులపై నిఘా పెట్టండి


స్థానికులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు, ఎస్‌ఐ తేజంరెడ్డి

యాచారం: అనుమానితులపై నిఘా ఉంచాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు సూచించారు. పీఎస్ పరిధి మీరాఖాన్‌పేటలో శుక్రవారం ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తుల సంచారం, గంజాయి అమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫొటోలను మార్ఫింగ్ చేసి, డబ్బులు డిమాండ్ చేయడం, వాట్సాప్ గ్రూపుల్లో బెదిరింపులకు పాల్పడడం లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటివి జరిగినా, ఎవరైనా మోసపోయినా వెంటనే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తేజంరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలకు కుర్చీల వితరణ


గ్రీన్‌బోర్డులు, కుర్చీలు అందజేస్తున్న దాత

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పడకల్ గ్రామం వాలీబాల్ యూత్ అధ్యక్షుడు కుమ్మరి మల్లేశ్ శుక్రవారం గ్రీన్‌బోర్డులు, కుర్చీలను ప్రిన్సిపాల్ మాధవరావుకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ షణ్ముకరెడ్డి, నాయకులు కాలె శేఖర్, కృష్ణకాంత్, యాదయ్య, విజయ్‌కుమార్, సంతోష్‌కుమార్, వెంకన్న, పరమేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వంతెనలున్నా.. వెతలే

- పోటెత్తుతున్న వరద
- బ్రిడ్జి పై నుంచి ప్రవాహం పరవళ్లు
- స్తంభిస్తున్న రాకపోకలు
- ఏటా వెంటాడుతున్న ప్రమాదం
- ఆందోళనలో బాధిత గ్రామాల ప్రజలు



రోడ్డుకు పది అడుగుల కిందకి

ఈ చిత్రంలో కనిపిస్తున్నది బాటసింగారం- మజీద్‌పూర్ గ్రామాల మధ్య ఉన్న వంతెన. ఇది రోడ్డుకు సుమారు 10 అడుగుల కిందకు ఉంటుంది. వర్షాలు కురిసిన ప్రతిసారి దీనిపై నుంచి భారీగా వరద పారుతుంటుంది. ఇలా ఏటా జరుగుతుంటుంది. వరద ఉధృతి తగ్గే వరకు ఆ మార్గం గుండా రాకపోకలు స్తంభిస్తుంటాయి. పై రెండు గ్రామాలతో పాటు.. నెర్రపల్లి, దండుమైలారం, ఇబ్రహీంపట్నం వెళ్లే వాహనాలు, ప్రయాణికుల ప్రయాణం నిలిచిపోతుంటుంది. ఈ వంతెన పై నుంచి 2021లో కారులో వెళ్తున్న వ్యక్తి వరదలో చిక్కుకుపోయాడు. స్థానికులు జేసీబీల సహాయంతో అతడిని కాపాడారు.

పేరుకే బ్రిడ్జి..

ఈ చిత్రంలోని కనిపిస్తున్న వంతెన మజీద్‌పూర్- గుంతపల్లి గ్రామాల మధ్య అవంతి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉంది. ఇది పేరుకు బ్రిడ్జే కానీ.. రోడ్డుకు ఆరు అడుగుల కిందకు ఉంటుంది. వానాకాలంలో ఇక్కడి కష్టాలు చెప్పలేనివి. వర్షాలు కురిసిన ప్రతి సారి వరద జోరుగా పరవళ్లు తొక్కుతుంటుంది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోతుంటాయి. 2020లో కురిసిన భారీ వర్షాలకు ఈ వంతెనకు సమీపంలోని గుంతపల్లిలోని చెరువు కట్ట తెగిపోయింది. కాల్వకు ఆనుకొని ఉన్న పలు నివాసాలు జలప్రవాహానికి కూలిపోయాయి.





ప్రకటనలకే పరిమితం

ఇదీ అబ్దుల్లాపూర్‌మెట్- లష్కర్‌గూడ, అనాజ్‌పూర్ గ్రామాల మధ్య ఉన్న వంతెన. దీని పై నుంచి 2020లో ప్రవహించిన వరద ధాటికి కారుతో సహా ఇద్దరు వ్యక్తులు కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. పెద్దఅంబర్‌పేటలోని కత్వా నుంచి పెద్ద ఏరు ద్వారా వచ్చే వరద నీరు ఈ వంతెన పై నుంచి పరుగులు తీస్తుంటుంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఈ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని గతంలో పలువురు ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేశారు. కానీ అది ప్రకటనలకే పరిమితమైంది.


మజీద్‌పూర్- గుంతపల్లి వంతెనపై వరద ఉధృతి (ఫైల్)

వానాకాలంలో ఆ మూడు మార్గాల్లో వరద ప్రవాహం పోటెత్తుతుంది. వంతెనలు ఉన్నప్పటికీ.. అవి రహదారికి కొన్ని అడుగుల మేర కిందకు ఉండటంతో ఏటా రవాణా స్తంభిస్తోంది. దీంతో ప్రమాదాలు పరిపాటిగా మారాయి. ఇలా గడిచిన నాలుగైదేళ్లుగా సమస్య ఉత్పన్నమవుతున్నప్పటికీ.. పట్టించుకున్న వారే లేరని బాధిత ప్రజలు ఆరోపిస్తున్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: వర్షాకాలం వచ్చిందంటే పాలకులు, అధికారులు వంతెనల గురించి ఆలోచిస్తారు. హడావుడి చేస్తారు. ప్రజల ఆందోళన మేరకు ఇదిగో.. అదిగో బ్రిడ్జి. నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని ఆర్భాటం చేస్తుంటారు. ఈ లోపు కాలం ముగుస్తుంది. ఆ తర్వాత అంతా కామ్ అయిపోతారు. ఇదీ అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ఏళ్లుగా జరుగుతున్న తంతు.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని

వానాకాలంలో వర్షాల ధాటికి మండలంలోని మూడు వంతెనల పై నుంచి ప్రమాదకరంగా వరద ప్రవాహం పరవళ్లు తొక్కుతుంది. ఆ సమయంలో ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. జల ఉధృతికి పలువురు కొటుకుపోయి మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. ఇలా నాలుగేళ్లుగా జరుగుతున్నప్పటికీ.. పాలకులు, అధికారులు ఆయా ప్రాంతాల ప్రజల ఇబ్బందులు, స్తంభించిన రవాణా, బ్రిడ్జిల నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వరదను దాటుకుంటూ గమ్యానికి చేరుకుంటున్నామని బాధిత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, తక్షణమే వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లికి చెందిన జంగయ్యకు రూ.34 వేలు, ఆమనగల్లు పట్టణ వాసి సత్తెమ్మకు రూ.52 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు నగరంలోని తన నివాసంలో బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎవరికీ ఒక్క రేషన్ కార్డు అందలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భగవాన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, జగన్‌గౌడ్, విజయ్‌రాథోడ్ పాల్గొన్నారు. అంతకు ముందు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పడకల్ గ్రామం మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలంను ఎమ్మెల్యే పరామర్శించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఆరోపించారు. కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. పట్టణంలోని భవానీ గార్డెన్‌లో శుక్రవారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అద్భుతంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి, స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, నాయకులు నర్సింహ, రవిరాథోడ్, ప్రశాంత్, శ్రీశైలం యాదవ్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వసతి కల్పించండి


కేఎల్లార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుక్కుగూడ: తుక్కుగూడ పురపాలిక పరిధి పలు గ్రామాల ప్రజలకు తాగునీటి వసతి కలిపించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన కేఎల్లార్.. సంబంధిత అధికారులకు ఫోన్ చేశారు. ప్రజలకు అవసరమైన తాగునీటి వసతి కల్పించాలని, అవసరమైన ప్రదేశంలో పార్కులను నిర్మించాలని సూచించారు.

పేదలకు వరంగా సీఎంఆర్‌ఎఫ్

పహాడీషరీఫ్: సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డితో కలిసి జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన చెన్నం పాండుకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్‌ను బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మన్న రవికుమార్, పరమేశ్, శాంతమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి..

కందుకూరు: నేదునూరు పంచాయతీ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతూ పలువురు గ్రామస్తులు.. మాజీ వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో.. కేఎల్‌ఆర్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామాన్ని ఫ్యూచర్‌సిటీలో విలీనం చేయాలని, హనుమాన్ ఆలయం నుంచి మురళీనగర్ వరకు ఆరు కిలోమీటర్ల రోడ్డును బీటీగా మార్చాలని, కేకే బస్తీ నుంచి మక్తమాధారం వరకు బీటీ రహదారి నిర్మించాలని, నేదునూరు అనుబంధ గ్రామం మాన్యగూడ, ముక్కిడివాగుతండాలను కలిపి నూతన గ్రామ పంచాయతీగా మార్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీనికి స్పందించిన కేఎల్లార్.. త్వరలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును కలిసి వారి దృష్టికి తీసుకెళ్లి వివరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, గ్రామశాఖ అధ్యక్షుడు సురేష్, సీనియర్ నాయకులు అమరేందర్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాలయ్య, బాబు, నాగరాజు, రాములు, నాయకులు నర్సింహ, శంకర్, శ్రీశైలం, రవి, మాన్యగూడ యూత్ అధ్యక్షుడు శివశంకర్, రమేశ్, కృష్ణ, పోశయ్య, మహేష్, పాండు, వెంకటయ్య, శంకర్, శ్రీరాములు, లక్ష్మయ్య, బాలకృష్ణ, వంశీ, రాజు, కె.జంగిలి, రంగన్ భిక్షపతి, ఆడివయ్య, చెన్నయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

పహాడీషరీఫ్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లను ఉక్కుపాదంతో అణచివేస్తామని మహేశ్వరం ఏసీపీ ఎస్.జానకీ రెడ్డి హెచ్చరించారు. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు శుక్రవారం ఆయన ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డితో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు.రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. సామాన్య ప్రజలపై బెదిరింపులకు పాల్పడడం, ఇతర నేరాలలో భాగస్వాములైనట్లయితే పీడీ యాక్ట్ నమోదు చేస్తా మ ని తెలిపారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో పెట్రోలింగ్ కొనసాగిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామని చెప్పారు.

యూరియా కోసం ఆందోళన వద్దు


నానో యూరియా వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శోభారాణి

ఆమనగల్లు: యూరియా కోసం అన్నదాతలు ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాఖ ఏడీఏ శోభారాణి అన్నారు. శుక్రవారం నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ ఆమనగల్లు డివిజన్ ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల్లో సుమారు 80 వేల ఎకరాలలో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుత వర్షాలతో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారని, యూరియా దొరకక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అవసరమైన నానో యూరియా అందుబాటులో ఉందని, దానినే వినియోగించాలని సూచించారు.

మైసమ్మ సన్నిధిలో శాకాంబరీ ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న కాలనీవాసులు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ 4వ వార్డు బ్యాంకు కాలనీలోని కనకదుర్గ మైసమ్మ ఆలయంలో శుక్రవారం శాకాంబరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాకేష్ గౌడ్, ఆలయ ఫౌండర్ పీతాంబర్, వార్డు మాజీ సభ్యుడు సంతోష్ గౌడ్, నాయకులు జంగారెడ్డి, వెంకన్న, శేఖర్ గౌడ్, వెంకటేశ్ గౌడ్, నరసింహ గౌడ్, ఆలయ అర్చకుడు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా సురేష్



ఇబ్రహీంపట్నం: సీపీఐ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శిగా పోల్కంపల్లి గ్రామానికి చెందిన కావలి సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ 11వ మండల మహాసభ శుక్రవారం పట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కార్యదర్శిగా సురేష్, సహాయ కార్యదర్శులుగా ప్రవీణ్, శివరాల సూర్యంలను నియమించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింహ్మా ఉన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు 31 వరకు అవకాశం


రాధిక, ప్రిన్సిపాల్

ఇబ్రహీంపట్నం: డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 31 వరకు స్పెషల్ ఫేజ్ అవకాశాన్ని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కల్పించిందని ఇబ్రహీంపట్నం కళాశాల ప్రిన్సిపాల్ రాధిక శుక్రవారం తెలిపారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులకు ఇదో మంచి అవకాశమని పేర్కొన్నారు. దోస్త్ స్పెషల్ ఫేజ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, 31 వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చునని సూచించారు. ఆగస్టు 3న సీట్లు కేటాయిస్తారని చెప్పారు. పట్నం కళాశాలకు విద్యార్థులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

సమస్యలపై పోరాటంలో ముందుంటాం

- పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు
- బడంగ్‌పేట్, బాలాపూర్‌లో సంఘం సభ్యత్వ నమోదు


ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

బడంగ్‌పేట్: ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం, పరిష్కారంలో తమ సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు అన్నారు. బడంగ్‌పేట్, బాలాపూర్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జీహెచ్‌ఎం రామానుజారెడ్డి, ఎఫ్ఏసీ హెచ్‌ఎం జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులకు మెంబర్‌షిప్‌లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, డిమాండ్ల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ బాలాపూర్ మండల అధ్యక్షుడు కె.రాంభూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర బాధ్యులు ప్రతాప్‌రెడ్డి, చైతన్యకుమార్, కృష్ణజీ, ధనుంజయ్, వెంకటరమణారెడ్డి, మండల బాధ్యులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

తుర్కయంజాల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేసి, కనీస వేతనం చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కిషన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారానికి శనివారం నగరంలోని సీడీఎంఏ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను భారీ ఎత్తున కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారి విద్యార్హతలు, వృత్తి నైపుణ్యం ఆధారంగా పదోన్నతి కల్పించాలని కోరారు.

విపత్తు నిర్వహణ కమిటీ ఏర్పాటు

ఆమనగల్లు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి మున్సిపాలిటీ పరిధిలో విపత్తు నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ ఏఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, వార్డు ఆఫీసర్ రమేశ్‌నాయక్‌ల ఆధ్వర్యంలో కమిటీని నియమించామని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని వెల్లడించారు.

పొంచి ఉన్న ముప్పు..


బుర్హాన్ ఖాన్ చెరువు తూమును పరిశీలిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సీజనల్ వ్యాధులతో జాగ్రత్త
- మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్
- బుర్హాన్ ఖాన్ చెరువు పరిశీలన

పహాడీషరీఫ్: ప్రస్తుత వర్షాలతో ప్రమాదం పొంచి ఉందని, ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ అన్నారు. బుర్హాన్ ఖాన్ చెరువులోకి వదర వస్తే.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బంది తగిన చర్యలు తీసుకోనున్నారని తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి ఉస్మాన్‌నగర్‌లోని బుర్హాన్ ఖాన్ చెరువు పరిసరాలను కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువు ఎంత వరకు నిండింది, ముంపు ప్రభావం ఎలా ఉంది, రెండో తూము నుంచి దిగువకు నీరు ఏ స్థాయిలో వెళ్తుందో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా.. ఎప్పటి నుంచో నిండు కుండలా ఉన్న ఈ చెరువుతో ఇప్పటికే కొన్ని నివాసాలు నీట మునిగి, బాధితులు ఇళ్లను ఖాళీ చేసి వదిలిపోయారు. తాజా వర్షాలతో ఎగువన ఇళ్లల్లోకి నీరు రానప్పటికీ, రెండో తూము నుంచి మిగులు నీరు వెంకటాపూర్ వీకర్ సెక్షన్ కాలనీ మీదుగా వేసిన పైప్‌లైన్‌లోకి సాఫీగా వెళ్లేలా మార్గాలను శుభ్రం చేయించారు. కమిషనర్ వెంట మాజీ కౌన్సిలర్ మజహార్ అలీ, పర్యావరణ అధికారి ఎం.శ్రీను తదితరులు ఉన్నారు.

ఫ్రైడే ను డ్రైడేగా పాటించాలి

వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటించాలని కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. పహాడీషరీఫ్ గ్రామంలో ఫ్రై డే-డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారానికి ఒక రోజు ఇంట్లో సంపు, పాత్రల్లో ఉన్న నీటిని పూర్తిగా పారబోసి, కొత్త నీటిని పట్టుకోవాలని సూచించారు. ఇలా చేయడం వలన నిల్వ నీటిలో లార్వా దశలో ఉన్న దోమలు వృద్ధి చెందవని తెలిపారు. వర్షాకాలంలో దోమల కారణంగా మలేరియా, డెంగీ తదితర విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ఇళ్లల్లో ఉన్న పాత కొబ్బరి చిప్పలు, టైర్లను పడేయాలని సూచించారు. మున్సిపల్ తరఫున ఎప్పటికప్పుడు ఫాగింగ్ నిర్వహించడంతో పాటు, నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్నామని చెప్పారు. చెత్తను ఎత్తిన వెంటనే బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నామని పేర్కొన్నారు.